ట్రాఫిక్ ఏసీపీ రణవీర్‌రెడ్డికి ఉత్తమ సేవా పతకం



గచ్చిబౌలి: మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ రణవీర్‌రెడ్డిని ఉత్తమ సేవా పతకానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. గతంలోనూ రణవీర్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్, రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలు అందజేశాయి.

లోన్ పేరిట సైబర్ మోసం

● రూ.లక్ష పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: లోన్ ఇప్పిస్తామని ఆశ చూపి ఓ వ్యక్తి నుండి సైబర్ మోసగాడు రూ. ఒక లక్ష 12 వేలు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ ఆర్‌ఆర్ హోమ్స్‌కు చెందిన వ్యక్తికి గత ఏడాది మే 5వ తేదీ లోన్ ఇప్పిస్తామని ఫోన్ కాల్ వచ్చింది.దీంతో అపరిచిత వ్యక్తి పెద్ద మొత్తంలో నగదు లోన్ ఇప్పిస్తామని ఆశ చూపి రూ. ఒక లక్ష,12 వేలు బాధితుడితో తన ఖాతాకు వేయించుకున్నాడు.దీంతో బాధితుడు లోన్ కోసం అపరిచిత వ్యక్తిని గట్టిగా అడగడంతో స్పందించలేదు.బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘గురునాథం’లో గుర్రపు డెక్క

● చెరువంతా మురుగుమయం
● విజృంభిస్తున్న దోమలు



గుర్రపు డెక్కతో నిండిపోయిన మియాపూర్‌లోని గురునాథం చెరువు



నిమజ్జన కోనేరులో వ్యర్థాలు

మియాపూర్ : మియాపూర్‌లోని గురునాథం చెరువులో గుర్రపు డెక్క భారీగా అల్లుకుంది. దూరం నుంచి చూస్తే పచ్చని తివాచీలా కనిపించే చెరువు మురుగుమయంగా మారింది. పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇక దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను సుందరీకరిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్న మాటలు నీటి మీద రాతలుగా మారాయి. చెరువుల్లో ఉన్న గుర్రపు డెక్కను తాత్కాలికంగా తొలగిస్తుండడంతో మళ్లీ పెరిగి దోమలకు ఆవాసంగా మారుతోంది.

◆ గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చెరువుల అభివృద్ధిలో భాగంగా లక్షల రూపాయలు వెచ్చించి పలుమార్లు గుర్రపు డెక్కను తొలగించారు. చెరువుకట్ట మరమ్మత్తులు చేసి మురుగునీటి మళ్లింపు పనులు చేపట్టారు. చుట్టు కంచె ఏర్పాటు చేశారు. కానీ చెరువులో ఉన్న మురుగునీటిని తొలగించకుండా పైనుంచి వచ్చే మురుగునీటిని చెరువులో కలవకుండా చర్యలు చేపట్టలేదు. దీంతో చెరువులోకి మురుగు పారుతోంది. సుందరీకరణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో తిరిగి గుర్రపు డెక్క పెరిగి సమస్య మొదటికి వచ్చింది.

వ్యర్థాలతో నిండిన నిమజ్జన కోనేరు

◆ గురునాథం చెరువులో నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసిన కోనేరులో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారైంది. ఎప్పటికప్పుడు కోనేరును శుభ్రం చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. నిమజ్జన సమయంలో తూతూ మంత్రంగా వ్యర్థాలను తొలగించి వదిలేస్తుండడంతో పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.

◆ కోనేరు వద్ద లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం తాగి బాటిళ్లను పగులగొట్టి పడేస్తున్నారు. అదేవిధంగా చెరువు చుట్టు చెత్తాచెదారం ,నిర్మాణ వ్యర్థాలను పడవేయడంతో అపరిశుభ్రంగా మారింది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పథంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ ఆదాయంలో మొదటి స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాలకమండలి సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 14 ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్‌ను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల రూ.23 కోట్ల రూపాయలతో 160 దుకాణ సముదాయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ఐదు కోట్ల రూపాయల లక్ష్యాన్ని ఇప్పటికే సాధించడం జరిగిందని తెలిపారు.రైతులకు కొనుగోలుదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మల్లారెడ్డి, డైరెక్టర్‌లు, మార్కెటింగ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భజగోవిందం



భజగోవిందం కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందుకున్న గాయకులు, కళాకారులు

మాదాపూర్: మాదాపూర్‌లోని మల్లన్న ఆలయంలో సోమవారం రాత్రి శ్రీవాణి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భజగోవిందం కార్యక్రమాన్ని నిర్వహించారు. తపోవన శ్రీమఠాధిపతులు శ్రీ పరమహంస సద్గురువు సచ్చిదానంద సరస్వతీ మహస్వామి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవన్నామ సంకీర్తన సకల ఫలదాయక మన్నారు. కలియుగంలో భక్తి, ముక్తి, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యం, అన్నీ కూడ సులభంగా పొందే మార్గం నామ సంకీర్తనం అన్నారు. సంగీత కళారత్న యరగొల్ల శ్రీనివాస్‌యాదవ్ బృందం16 సంకీర్తనలను గానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సురేష్‌గౌడ్, బొద్దం కృష్ణయాదవ్, చింతల రమేష్, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు. గాయకులు, కళాకారులకు సర్టిఫికెట్‌లను అందజేశారు.



భెల్ ఎంఐజీ కాలనీలోని రైల్వే ట్రాక్ రోడ్డులో పగలు వెలుగుతున్న స్ట్రీట్ లైట్లు



చీకటిగా ఉన్న దోయెన్స్ కాలనీ పాత ముంబాయి జాతీయ రహదారి

పగలు వెలుగుతున్నాయ్..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో స్ట్రీట్‌లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. రాత్రివేళల్లో లైట్లు వెలగక వాహనదారులు ఇబ్బందుల పాలవుతుండగా, ఓవైపు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండటంతో విద్యుత్ దుబారా అవుతోంది. గుల్‌మొహర్‌పార్కు కాలనీ నుంచి డోయన్స్ టౌన్‌షిప్, జీహెచ్‌ఎంసీ ఆఫీస్ పాత ముంబాయి జాతీయ రహదారిపై స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో ఒక వైపు స్థానికులు, వాహనదారులు అసౌకర్యానికి గురవుతుండగా, మరోవైపు భెల్ ఎంఐజీ కాలనీ రైల్వే ట్రాక్ రోడ్డులో లైట్లు పగటి పూట వెలుగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

‘మనూ’–టర్కీ యూనస్ ఎమ్రే ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయం–టర్కీ యూనస్ ఎమ్రే ఇన్‌స్టిట్యూట్‌తో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు మంగళవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో రెండు సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సమక్షంలో సంతకాలు చేశారు. ఉర్దూ యూనివర్శిటీ నుంచి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, ఆ సంస్థ పక్షాన టర్కీ కాన్సుల్ జనరల్ ఓర్హాన్ యల్మాన్ ఓకాన్‌లు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రెండు సంస్థలు అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, ఉపన్యాసాలు అందించడం, పరిశోధనలో పాల్గొనడం, ఉమ్మడి ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, విద్యార్థుల మార్పిడి, నివాసి, నాన్‌రెసిడెంట్ ఫ్యాకల్టీ సభ్యుల మార్పిడి, ప్రాజెక్టు అభివృద్ధి, అమలు, విద్య, సాంస్కృతిక, శాస్త్రీయ విషయాలకు సంబంధించిన సామర్థ్యం పెంపుదల కోసం అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించడం, విశ్వవిద్యాలయం మిషన్లు, టర్కీ యొక్క అకడమిక్, సైంటిఫిక్ కోఆపరేషన్ ప్రాజెక్టు పరిధిలో సమిష్టిగా కృషి చేయడంపై పరస్పర సహకారం అందించుకోవాలనే ఒప్పందం చేసుకున్నారు.

మాస్టర్ అథ్లెట్ రాష్ట్ర పోటీల్లో రంగారెడ్డి హవా



పతకాలు సాధించిన వారితో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్, సురేందర్

అభినందించిన జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్

గచ్చిబౌలి: రాష్ట్ర స్థాయి 10వ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో 111 పతకాలు సాధించి రంగారెడ్డి జట్టు ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం. ఈ పోటీల్లో రంగారెడ్డిజిల్లా నుంచి 33 మంది మహిళలు, 47 మంది పురుషులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. వీరంతా కలిసి 43 బంగారు, 33 రజత, 35 కాంస్య పథకాలను సాధించారు. బంగారు పతకాలను సాధించిన వారిలో ఏసురత్నం, మానసపతి, నాగలక్ష్మీ తదితరులు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నూనె సురేందర్‌ను కలిశారు. పతకాలను సాధించిన వారిని వీరిద్దరు అభినందించారు. జాతీయ స్థాయి పోటీలను ఫిబ్రవరి 9,10,11 తేదీలలో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు జనవరి చివరి వారంలో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

ప్రజాపాలన.. జంట సర్కిళ్లలో 15,757 దరఖాస్తులు

శేరిలింగంపల్లి/హఫీజ్‌పేట్: ప్రజాపాలన కార్యక్రమంలో మంగళవారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో 15,757 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఆరు గ్యారంటీ స్కీమ్ కోసం 11,265 దరఖాస్తులు వచ్చాయి. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో 6,200 దరఖాస్తులు ఆరు గ్యారంటీ స్కీమ్‌ల కోసం కాగా, 2,500 దరఖాస్తులు ఇతర అంశాలపై ప్రజలనుంచి స్వీకరించారు. అదేవిధంగా చందానగర్ సర్కిల్‌లో మొత్తం 7057 దరఖాస్తులు రాగా అందులో 5065 దరఖాస్తులు ఆరు గ్యారెంటీ స్కీమ్‌ల కోసం కాగా 1,992 దరఖాస్తులు ఇతర అంశాలపై ప్రజలనుంచి స్వీకరించారు.

ఓచోట రద్దీ.. మరోచోట తక్కువ

ప్రజా పాలన కార్యక్రమాన్ని రెండు రోజుల సెలవు అనంతరం మంగళవారం మళ్ళీ ప్రారంభించారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలోని 28 కేంద్రాలలో ఒక చోట బారులు తీరగా మరికొన్ని చోట్ల తక్కువ సంఖ్యలో జనం కనిపించారు.



హఫీజ్‌పేట్‌లో ప్రజాపాలన కేంద్రం

ఇద్దరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం 20 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఇద్దరికి పాజిటివ్ నిర్ధారణ అయిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 18 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.మంగళవారం భెల్ కాలనీలోని పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని భెల్ అధికార కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు అశోక్, కుమార్, సంతోష్, స్వామి, ఆనందం పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎంఏ.రజాక్ కథనం ప్రకారం...పటాన్‌చెరు పట్టణ శివారులోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం వెనుక ఉన్న ఖాళీ స్థలంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న అర్చకులు మహేష్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయసు 35 నుండి 40 ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణీనగర్ కాలనీకి చెందిన నాగ శిరీష జేఎంజె హైట్స్‌లో వాచ్‌మెన్‌గా ఉంది. సంక్రాంతికి స్వగ్రామమైన ఏలూరు జిల్లా... రాజుపాలెం గ్రామానికి వెళ్దామని డిసెంబర్ 30వ తేదీన భర్తతో చెప్పింది. పిండి వంటల విషయంలో భర్త దేవరాజుతో గొడవ పడింది. ఆవేశంలో నాగ శిరీష గడ్డి మందు తాగింది.దీంతో చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి శీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అతిగా మద్యం సేవించిన వలస కూలీ మృతి చెందిన సంఘటన కొల్లూరులో మంగళవారం చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన ముఖేష్ (26) జీవనోపాధికి మూడునెలల క్రితం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరుకి వలస వచ్చాడు.కొల్లూరులోని బ్రిక్స్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మిత్రులతో కలిసి అతిగా మద్యం సేవించి కింద పడిపోయాడు.ఎంతకి లేవకపోవడంతో మద్యం మత్తులో లేవడం లేదని అతని మిత్రులు ముఖేష్‌ను గదిలోకి తీసుకెళ్లి పడుకోపెట్టారు. అనంతరం ఎంత సేపటికీ లేవకపోవడంతో తోటి మిత్రులు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని స్నేహితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలు అందేలా చూడాలి



ఆదిత్యనగర్ కాలనీలో ప్రజా పాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్

హఫీజ్‌పేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.2500, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు లేనివారికి ఇంటి స్థలం , రూ.5లక్షల సాయం, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, చేయూత పథకం కింద నెలకు రూ.4వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6000 పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హమీద్, కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌యాదవ్, రహీం మునఫ్ ఖాన్, ఖాజా, ఫైజల్, అంజాద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో దుస్తుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడలోని ఫుల్ గాస్పెల్ చర్చిలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్లకు కొత్త దుస్తులను శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ అధికారుల సమన్వయ లోపం వల్ల దుస్తుల పంపిణీ ఆలస్యమైందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ పార్టీ నాయకులు కాశీనాద్ యాదవ్, మోజెస్, పాస్టర్లు ఇబ్రాయిల్, సత్యరాజ్, కర్ణాటక రాజు, సురేష్‌కుమార్, రాజు, గోపి, ముఖేష్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 07 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ. 10 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నేడు సామూహిక వ్రతాలు

నిజాంపేట్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తిరుప్పావై 18వ రోజును పురస్కరించుకుని ఈ నెల 3న నిజాంపేట్ బండారి లేఅవుట్‌లోని దక్షిణముఖ అభయాంజనేయస్వామి ఆలయంలో సాయంత్రం 6.30 గంటలకు శ్రీలక్ష్మీ నారాయణస్వామి సామూహిక వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ వ్రతంలో పాల్గొనదలిచే దంపతులు సాంప్రదాయ దుస్తులు ధరించి రావాలన్నారు.

పెట్రోల్ బంకుల వద్ద వాహనదారుల క్యూ



విశ్వనాథ్ థియేటర్ వద్ద..



లింగంపల్లిలో పెట్రోల్ బంకు మూసివేసిన దృశ్యం

గచ్చిబౌలి/ శేరిలింగంపల్లి: నగర శివారులోని శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పెట్రోల్ బంకుల వద్ద రద్దీ పెరిగిపోయింది. పెట్రోల్ ట్యాంకర్ల వారు సమ్మె చేయడంతో ట్యాంకర్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో కొన్నిచోట్ల పెట్రోలు అయిపోవడంతో, రద్దీ పెరగడంతో మరి కొన్ని చోట్ల బంకులను మూసి వేయాల్సి వచ్చింది. భారీగా వాహనాలు బంకుల వద్దకు రావడంతో రోడ్లపై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ నుంచి గుల్‌మోహర్‌పార్కుకు అయిదు నిమిషాల్లో చేరుకోవచ్చు, కానీ 35 నిమిషాలు పట్టింది. రోడ్లపై వాహనాల రద్దీ, బంకుల వద్ద బారులు తీరడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. చందానగర్, లింగంపల్లి, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ప్రాంతాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కాగా సమ్మె విరమించారని, రాత్రి వరకు పెట్రోల్ ట్యాంకర్లు వస్తాయని యజమానులు స్పష్టం చేశారు.

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పెట్రోల్ బంక్‌ల వద్ద ఉదయం నుంచి ప్రజలు బారులు తీరారు. కొన్ని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డు పెట్టగా మరికొన్ని పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కూకట్‌పల్లి సర్కిల్ విశ్వనాథ్ థియేటర్ వద్ద ఉన్న పెట్రల్ బంకుల్లో లైన్‌లో నిల్చొని పెట్రోల్ కోసం పడిగాపులు కాశారు. ట్యాంకర్ల యజమానులు సమ్మెకు దిగడంతో పెట్రోల్ దొరకదని కొందరు క్యాన్లను తీసుకొచ్చి మరికొందరు బాటిళ్లలో తీసుకెళ్లేందుకు క్యూ కట్టారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

● ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



లబ్ధిదారులకు దరఖాస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో నూతన సంక్షేమ పథకాల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.మంగళవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 10, 20 వార్డులలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు బోయిని బాలమణి బాలరాజు, అనిరుధ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులకు డిమాండ్



బొంతపల్లి కేంద్రంలో రద్దీ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొంతపల్లి, కానుకుంట, అన్నారం గ్రామాలలో మంగళవారం ప్రజాపాలన దరఖాస్తులు అందక వందల సంఖ్యలో ప్రజలు క్యూలో నిల్చున్నారు. అధికారులు ప్రణాళికబద్దంగా వ్యవహరించకపోవడంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు అంటున్నారు. ప్రతి కుటుంబానికి దరఖాస్తు పత్రం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారని కోరారు.

అక్కమ్మ చెరువు వాగును కాపాడాలి




జిన్నారం అక్కమ్మ చెరువు వాగు వద్ద కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): అక్కమ్మ చెవురు వాగును ఓ పరిశ్రమ కబ్జా చేస్తుందని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. మండల కేంద్రమైన జిన్నారం పరిధిలోని కొచ్చెరువు నుండి అక్కమ్మ చెరువులోకి వాగు ఉన్నది. మంగళవారం ఆ వాగును ఓ కంపెనీ కబ్జా చేస్తుండడంతో విషయం తెలిసిన పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అడ్డుకున్నారు. కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

పూడిక రోడ్డుపైనే..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని వరద నీటి కాల్వల్లో పూడిక తీసి రోడ్డుపైనే వేశారు. తీసిన పూడిక తిరిగి కాల్వల్లోకే చేరుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువురు ఆరోపిస్తున్నారు. వరద నీటి కాల్వల్లో పూడిక తీయడం వలన వరద నీరు సాఫీగా నాలాల్లోకి వెళ్ళే చూడటం ప్రధాన లక్ష్యం. అలా కాకుండా తీసిన పూడికను వెంటనే తొలగించాల్సిన కాంట్రాక్టర్లు వాటిని నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో స్థానికులు వెంటనే పూడికను తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో..